# భవిష్యత్తు

"కుర్ కొండ—దే—వ—త! కొండ—దే—వ—త!
కొండ—దే—వ—తా."

తల ఎత్తి చూశాను. ఎదురుగా కోయరాజా. భుజాన జోలె వేలాడుతూంది. గొంగళీ వీపు నంటుకొని ఉంది. మెడలో గవ్వల దండ, రెండు చేతులకు మణికట్టువద్ద యంత్రాలు, మోచేతికి పైన వేళ్లలో తయారు చేయబడ్డ రింగులు. నుదుట కుంకుమబొట్టు. మోకాళ్ల వరకే కట్టిన మాసిన ముతక అడ్డపంచ. వీపునిండా, వక్షమునిండా నల్లగా, దట్టంగా పెరిగిన వెంట్రుకలు. చిక్కుపడి, జడలు కట్టుటకు సిద్ధంగా ఉన్న వెరులు. చిరుగడ్డం, నల్లని దేహం. నిండుగా చెమటపోసి ఆరిపోగా ఏర్పడ్డ జిడ్డుముఖం — ఇదీ అతని స్వరూపం. తనే భవిష్యత్తు కధికారినన్న అహం ప్రతిఫలిస్తున్న కళ్లు సూటిగా ఎదటి వ్యక్తి హృదయంలోకి చొచ్చుకొనిపోతూ ఉంటాయి.

"కొండ—దే—వ—త—! కొండ—దే—వ—త! రామన్న! హనుమన్న!" అని వల్లిస్తూ వసిూపిస్తున్నాడు. తల వంచుకొని పనిచేస్తున్న నేను తల ఎత్తి అతనివైపు చూశాను. ఆదివారం గనక, ప్రశాంతంగా కూర్చుని పనిచేసుకోటానికి ఆఫీసుకు వచ్చాను. ఆఫీసులో డే వాచ్‌మన్‌తప్ప మరెవ్వరు లేరు.

కోయరాజాను చూడగానే ఒక విషయం జ్ఞప్తికి వచ్చింది. రెండు రోజులక్రితం నా భార్య తన చేయి చూపించుకుంటానంది, కోయరాజా వస్తే!

"వాళ్ల ముఖం, వాళ్లూను. వారి భవిష్యత్తే వారికి తెలియక అడుక్కు తింటున్నారు. మన భవిష్యత్తేం చెబుతారు?" అన్నాను.

"మీా రెప్పుడు ఇంతే! ఏదిమాత్రం పడనిస్తారు గనక! సన్న్యాసుల్లా మీాకేమీా అక్కర్లేదు" అని నిష్ఠూరాలాడింది.

"సరేలే, ఏడిశావ్! నీ భాదస్తము, నీవూను!" అన్నింటికి అతీతునిలాగ పలికాను.

మనస్సు నొచ్చుకొని ఇంట్లోకి వెళ్లింది.

ప్రతి వ్యక్తికి తన భవిష్యత్తు తెలుసుకోవాలని ఎందుకో బలీయమైన కోరిక. తన భవిష్యత్తు ఆనందదాయకంగా, పురోగామిగా, అభివృద్ధిసూచకంగా ఉంటుందని ప్రతి ఒక్కని నమ్మకమూను. ఈ ఆశతోనే ప్రయత్నం సాగిస్తూంటాడు. తన అభిప్రాయానికి అనుకూలమైన మాటలు వింటే, పొంగి పోకుండా ఎవడు ఉండగలడు?

కాని జీవితం మన మాశించేటంతటి సుఖదాయకం కాదు. మనం ఎదుర్కోబోయే కష్టాలగూర్చి ఎవరు చెప్పగలరు? ఎంత నీచస్థితిలో ఉన్నా భవిష్యత్తును స్వర్గతుల్యంగా చేసుకోవాలని ప్రతివాడు వాంఛిస్తాడు.

హస్తసాముద్రికవేత్తలు, జ్యోతిశ్శాస్త్రజ్ఞులు, కోయరాజులు కనిపిస్తే, ఎవరైనా తమ భవిష్యత్తు తెలుసుకోవాలని ఉవ్విళ్లూరుతారు. గతంలో ఎన్నో పాట్లు పడ్డాం, భవిష్యత్తైనా బాగుంటుందేమోనని ఆశ.

నా భార్య మానవాతీత వ్యక్తి కాదు. భార్య భర్తను కోరే కోరికే కోరింది. ఆ కోరికను తుంచివేశాను.

"రామన్న! అచ్చుమన్న! అనుమన్న! కొండ దే—వ—త! కొండ—దే—వ—త—!" అంటూ లోనికి వచ్చాడు, గడ్డంలో వేళ్లుదూర్చి దువ్వుకుంటూ.

"ఇబ్రహీం, ఇతన్ని వెళ్లమను. ఆఫీసని చెప్పు!" అన్నాను డే వాచ్‌మన్‌ని ఉద్దేశించి.

ఎంత చెప్పినా వెళ్లలేదు. అడుగడుగే వేసుకుంటూ లోనికి వచ్చాడు.

"దొరలు! దొడ్డదొరలు! రామబంటువే అంటున్నారు" అంటూ గడ్డం దువ్వుకుంటూ నావైపు చూశాడు నిశితంగా.

నేను పెదవి కదపలేదు.

"దొడ్డవారవుతారు! మహా దొడ్డవారవుతారు! మీా సేతికింద పదిమంది పనిసేసే రోజు లొస్తయ్! అంటు సెపుతూంది."

నేనేమీా అనలేదు. తల వంచుకొని అంకెలతో కుస్తీ పడుతున్నాను. మళ్లీ చెప్పటం మొదలుపెట్టాడు:

"మీా దొరను సూడాలని వచ్చిన. రామరావుగారే కద! రాజమండ్రిలో ఉండిరిలే! ఈ రామబంటు దొరవారి కెరుకేలే! ఉండరా! సూసిపోదామని వచ్చిన!"

"లేరు. ఈ రోజు సెలవు గనక రారు" అన్నాను.


ఐటెక్స్ సౌందర్య దోహదములు

✳ ఐటెక్స్ కాటుక
✳ ఐటెక్స్ బింది
✳ ఐటెక్స్ కుంకుం పేస్టు




అరవింద్ లేబరెటరీస్
పోస్టు బాక్సు నం. 1415, మద్రాసు-17

*ప్రతి వ్యక్తికి తన భవిష్యత్తు ఉజ్జ్వలం కావాలనే కోరిక ఉంటుంది. అందుకు అనుకూలమైన మాటలు ప్రోత్సాహాన్నిస్తాయి. భవిష్యత్తు స్వర్గతుల్యం కావాలనుకొనే వ్యక్తి, తద్భిన్నమైన మాటలు భరించలేడు. గుండెనిబ్బరం గల వ్యక్తికి ఏ జ్యోతిశ్శాస్త్రవేత్త అయినా నిజం చెప్పగలడు. కాని గొంతెమ్మ కోర్కెలు కోరేవారు నిజం చెబితే భరించగలరా?*

"రేపు వస్తారు గద!" అంటూ నా ముందుండే స్టూలుపై కూర్చున్నాడు, జోలె పక్కన పెడుతూ.

"అవును. రేపు రా!" అన్నాను.

'కాని మా ఆఫీసరు వీడికేం తెలుసు? బహుశః ఆయనకు భవిష్యత్తు చెప్పి ఉంటాడేమో!' అనుకున్నాను.

"మా ఆఫీసరుని ఇదివర కెరుగుదువా?"

"చెప్పితిని గద! రాజమండ్రిలో ఉండిరని. అక్కడికి నర్సరావుపేటనుండి వచ్చిరిలే! బాగా తెలుసు. సర్టిఫికెట్టుకూడా ఇచ్చిండు, సూడు" అంటూ తన జోలెలోని కాగితాలన్ని తీసి ఒక సర్టిఫికేటు పైకి లాగాడు. అది మా ఆఫీసరిచ్చినదే! అయిదేళ్ళక్రితం సంతకం పెట్టినట్టు ఉంది. ఈ సర్టిఫికేటు చూడగానే ఆశ్చర్యం వేసింది.

"ఇంకా సూత్తరా! మా డైరెక్టరుకు చెప్పిన. ఇదిగో!" అంటూ మరో కాగితం చూపించాడు.

సందేహంలేదు. డైరెక్టరు సంతకమే! ఇంత హోదాలో ఉండికూడా, ఆయనకు తన భవిష్యత్తు తెలుసుకోవాలని ఎంత బలీయమైన కోరికో! ఇవి చూసేవరకు వాడి చరిత్ర మొత్తం తెలుసుకోవా లనిపించింది.

"ఇంకా ఎవరెవరికి చెప్పావు?" అడిగాను.

మళ్ళీ జోలెలో చెయ్యి పెట్టి కొన్ని ఫోటోలు తీశాడు. ఆ ఫోటోలు చూసి నన్ను నేనే నమ్మలేక పోయాను.

"నాగేశ్వరరావు, రామారావు, సినిమా యాక్టర్లకు, డైరెక్టర్లకు చెప్పిన!" అంటూ వాటిని నా కిచ్చాడు.

'ఎంత దేశం తిరిగాడు! ఎందరికి చెప్పాడు! అసాధ్యుడే!' అనుకున్నాను.

మళ్ళీ జోలెలో చెయ్యి వేసి మరో ఫోటో తీశాడు.

"ప్రజా నాయకుడు మా గూడెం వచ్చినపుడు జోస్యం చెప్పినం! గూడెంలో తీయించుకున్న ఫోటో!" అన్నాడు.

నా ఆశ్చర్యానికి అంతులేదు. ఫోటోలు ఇచ్చివేశాను. వాటిని జోలెలో సర్దుకోటం మొదలెట్టాడు.

నాలోకూడా అట్టడుగున ఉన్న కోర్కె వెలరేగింది. ఇంతటికీ భవిష్యత్తు చెప్పిన ఇతనిచేత తప్పక చేయి చూపించుకోవాలనుకున్నాను.

**శిష్టు కృష్ణమూర్తి**



"ఎంతో దేశం తిరిగావు. పెద్దలెందరికో చెప్పావు. చేయి చూస్తే ఏం తీసుకుంటావు?"

"ఆఁ!. . . ఏ మిస్తరు? కాఫీ తెప్పించు. సుట్టలు తెప్పించు. ఏం కావాలి ఈ కోయరాజుకు, రామబంటుకు" అని తేలికగా అన్నాడు.

"మరి నా చేయి చూస్తావా? కాఫీ తెప్పిస్తాను."

"అంబ పలకాలె! అంబ పలకాలె!"

"ఏవో తోచింది చెప్పు!" అన్నాను వచ్చిన ధాన్స పోతుందేమోననే ఆశతో.

"తెప్పించు మరి కాఫీ, చుట్టలు!!"

వాచ్‌మన్‌ని పిలిచి కాఫీ, చుట్టలు తెమ్మని పంపాను.

"కుర్ కొండ-దే-వ-త. కొండ దే-వ-త! కొండ దే-వ-త! రామన్న! అనుమన్న! లచ్చుమన్న! సీతమ్మ!" అంటూ దేవతల పేర్లు తలవటం మొదలెట్టాడు.

"కంచి కామాక్షి! కనకదుర్గ! జగదంబ! ! పలుకంబ!" అని కళ్ళు మూసుకుని తెరిచాడు. వెంటనే నా చేతిని లాక్కొని, నా వైపు తీక్ష్ణంగా చూస్తూ, మరొక్క చేత్తో గెడ్డం దువ్వుకుంటూ చెప్పటం మొదలెట్టాడు.

'భార్యను వారించిన నేను ఏం చేస్తున్నాను?' అని మనసులో అనుకున్నాను. ఈమారు మళ్ళీ ఆవిడ అడిగితే తప్పక 'సరే'ననానికికూడా నిశ్చయించుకున్నాను.

"అంబ సెప్తుంది! జగదంబ సెప్తుంది! ! అనుమానిస్తున్నావు కదు, ఈ రామబంటుని, ఏమి సెప్తడని? ఈ రామబంటు సత్తెం ఎరుకలేదు. ఎరుకొస్తదిలే!"

"లేదు, లేదు. నమ్మకమే!" అన్నాను. నిజంగా నాకు అటువంటివాటిపై విశ్వాసం లేదు. ఈ సర్టిఫికేట్లు, ఫోటోలు చూపించకపోయుఉంటే, నేను ఈ పనికి పూనుకొనిఉండేవాడిని కాను.

"కష్ట జీవివి! కష్ట(ష్ట) జీవివి! సుఖం సున్న ఈ కల్టెకు. రెక్కల కష్టంమీద బతుకుతుండవ్! అందరికీ సాయం సేస్తవు. కానీ ఎవరూ నీకు సాయం సెయ్యరు."

కొంతమటుకు ఈ మాటలు నా జీవితానికి సరిపోయినట్లే తోచినయ్. కాని కష్టజీవి కానివాడెవ్వడు?

"సరే! ఇంకా!"

"నీది బహు దొడ్డమనసు! బయటి కగుపించవ్!"

నేను పలకలేదు. చెప్పుకుపోతున్నాడు.

"సెప్పుడు మాట లినే ఘటం కాదు. ముక్కుకు సూటిగా నడుస్తవ్! అందుకని నీవంటే ఇతరులకు గిట్టదు."

ఈ మాటలు వింటూంటే, మా అత్తగారింట్లో నాకుండే భేదాభిప్రాయాలు, మా అన్నతో తెగతెంపులు చేసుకున్న విషయాలు తట్టాయి. నా భార్యకూడా అప్పుడప్పుడు దెప్పిపొడుస్తూనే ఉంటుంది. కనక నేనేమీ బదులు చెప్పలేకపోయాను.

"నెలలో పదిరోజులు రోగంతో బాధపడతవ్. సరిలేదు వళ్ళు. రామబంటు పలుకు సత్తెమా?"

నా ఆరోగ్యం సరిగా లేకపోవటం నిజమే! నా ఆకారాన్ని చూస్తే ఎవడికైనా ఈ విషయం తెలుస్తుంది. కనక తల ఊపాను.

"సీతమ్మ, మీ సీతమ్మ దొడ్డ ఇల్లాలు."

"అంటే!"

"అంటే, ఎరుక లేదా? పెట్ట! మీ పెట్ట ఉంది గద, మంచి దంటున్నాను. మీ పెట్టవల్ల నీకు మంచి రోజులు గడుస్తున్నాయ్!"

మా ఇద్దరి మధ్య ఎన్ని భేదాభిప్రాయాలున్నా కలిసి ఉంటాం గనక 'మంచిదే' అనుకున్నాను.

"ఇంకా సెప్పుదునా? రెండు గెండాలు గడిచినయ్! యోగానికు తెచ్చుకో! ఇక పరవలేదు. అరవై ఏళ్లలో గెండం ఉంది. అది తప్పితే ఎనభై ఏళ్ల ఆయుస్సు నీది. గట్టిపిండం! భయంలేదు."

చిన్నప్పు డెప్పుడో పాముగండం తప్పిందని మా అమ్మ అంటూఉండేది. మొన్నమొన్ననే ఒక కారు ఆక్సిడెంటు తప్పించుకున్నాను. నా కీ రెండు స్ఫురించాయి.

"మూడు కూనలు! మూడు కూనలు!" అని మూడువేళ్ళు చూపాడు.

"ముగ్గురా!" ఆశ్చర్యం వెలిబుచ్చాను, నా కిద్దరే గనక.

"అవును. మొత్తం మూడు కూనలు!"

"ఇప్పుడో?"

"రెండు కూనలు కదా!" అని కొంచెం ఆలోచించి చెప్పాడు.

కొంత మాటవిరుపుతో ఈ నిజం నమ్మవలసి వచ్చింది.

"పరమోషన్ వచ్చేదుంది. ఏడు తిరిగేతలికి పైకెళ్లాలి. కాని అడ్డంకులున్నయ్!"

మా ఆఫీసరుకు, నాకు పడదు. నా కాన్ఫిడెన్షియల్స్ చెడ్డాయని అందరు ఆఫీసులో అంటున్నారు. మరి నమ్మకుండా ఎలా ఉండగలను?

"సెయ్యి జాపు! రెండు సేతులు! అంబ ప్రసాద మిస్త! అన్నీ తొలగిపోతయ్!" అని నా చేతులు ముందుకు లాగాడు.

"అంబ! జగదంబ! కుర్ కొండ దే—వ—త! కొండ దే—వ—త! కొండ దే—వ—త! ఇది సూస్తివి గద! సెయి పట్టు! మూతపెట్టు!" అని రెండు చేతులు మూశాడు. కాయలాంటి దేదో చేతిలో పెట్టడం గమనించాను. నా పిడికిలికేసి, వాని ముఖంకేసి చూస్తూ కూర్చున్నాను.

"రామబంటు పలుకు సత్తెం! జగదంబ! జగదంబ! కుర్ కొండ దే—వ—త! కొండదే—వ—త! కుర్! కుర్!" అని గట్టిగా అరిచి కళ్ళు మూసుకుని, ఏదో జపించి, కళ్ళు తెరిచి, భీకరంగా నాకేసి చూస్తూ, "చేయి తెరు!" అన్నాడు.

చేతిలో బంతిపూవు ఉంది. గచ్చకాయలాంటి దేదో పెట్టాడే! పూవెలా వచ్చింది? ఆశ్చర్యం!

"రామబంటు సత్తెం తెలిసిందా?"

నేను పలకలేదు.


"నీకు నాగదోషం పట్టింది. నశించిపోతుండవ్! ఒళ్ళు చెడిపోయింది. యంత్రమేస్తను. ఆరు నెల్లో బాగవుతది. అడ్డాలు తొలుగుతయ్! పైకి పోతవ్! నా మాట ఇనుకో! రామబంటు పలుకు సత్తెం! ఈ హనుమరాజు పలుకు తలుసుకుంట సెప్తుడా! యంత్ర మేస్తునా?"

నా కేమీ తోచలేదు. ఏమివ్వాలో అడిగే ఆలోచన రాలేదు.

"సరే! వెయ్యి" అన్నాను.

"మంత్రం సెప్త! లోపలికి రా! యంత్రమేస్త. జయం కలుగుతంది" అంటూ పక్క గదివేపు దారి చూపించాడు. ఆ రోజు ఆదివారమని ముందే చెప్పానుగా! వెళ్ళాను.

"కూర్చో, దొరా! కూర్చో!" అంటూ తన భుజాన ఉండే గొంగళీ పరిచాడు. కూర్చున్నాను.





## గాంధీజీ సూక్తులు

విజయం

దురాలోచనలుచేసే మనసుతో మనం సహకరించనిపక్షంలో అంతిమంలో విజయం మనకే సిద్ధిస్తుంది.

(ఇది గాంధీజీ శతజయంతి సంవత్సరం)

కళ్ళు మూసుకుని అంబను స్మరిస్తూ, కొండ దేవతను తలుచుకుంటూ జోలెలో చెయ్యి పెట్టి ఏదో పైకి తీశాడు. కనపడకుండా పిడికిలిలో ఉంది.

"దోసిలి పట్టు! చేయి కడుక్కో!" అని తన పిడికిలిని పిండాడు. నీళ్ళు కారాయి. చేయి తుడుచుకున్నాను. తరవాత చేయి చూపించాడు. అందులో ఏవో మూలికలు కనిపించాయి.

"చూస్తివా? రామబంటు సత్తెం!" అన్నాడు.

తల ఊపాను.

"కాయితం తీసుకో!"

తీసుకున్నాను.

"పెన్నను రాయి!"

"రామబంటు పలుకు సత్తెం! జబ్బు పోతది. పైకి పోతను. అడ్డాలు తొలుగుతయ్! హనుమరాజా పలుకు సత్తెం!" అని చెప్పాడు.

"రాస్తివా?" అడిగాడు.

ఇదేమి మంత్రమా అని అనుమానిస్తూ వ్రాశాను. అసలు రంగంలోకి దిగరాదు. దిగిన తరవాత చెప్పినట్లల్లా చేయక తప్పుతుందా! పైగా "అనుమానిస్తుండవ్" అని ముందే నోరు నొక్కేసిఉండె.

తల ఊపాను.

నా వద్దనుండి కాగితం తీసుకుని, తన మెడలో వ్రేలాడుతున్న తాయెత్తు తెరిచి, అందులో ఉండే మూలిక తీసి, నేను వ్రాసిఇచ్చిన కాగితంలో చుట్టి, యంత్రంలా తయారుచేశాడు. దాన్ని నా చేతికి బెత్తెడు దూరంలో పెట్టాడు. తరవాత నా చేతిని తన దోసిలిలోకి తీసుకొని, "నే చెప్పినట్లు పలుకు" అన్నాడు.

"హనుమరాజా పలుకు సత్తెమైతే, రామబంటు వాక్కు సత్తెమైతే చేతిలోకి రా! చేతిలోకి రా!" అని నా చేతిని మూలికకు సమీపంగా జరిపాడు. ఆ చిన్న పొట్లం కదులుతూ వచ్చి నా చేతిలో పడింది.

అతడు చెప్పినట్టల్లా పలకటం, చేయటం, కళ్ళప్పగించి చూడటంకన్నా, నేను చేయగలిగిందేమీ లేదు. ఏమి సత్యమో, ఏమి మంత్రమో మూలిక చుట్టిన కాగితం వదిలి రావటంమాత్రం అద్భుతంగా ఉంది. ఏదో చిట్కా మంత్రమై ఉండచ్చు!

"పూజచేసి ఇస్తను. మొలకు కట్టుకుందువు. జయమవుతది" అని పొట్లాన్ని తీసుకున్నాడు.

జోలెలో చెయ్యి పెట్టి దుర్గ పటాన్ని తీశాడు. ఆ పటాని కంటుకున్న కుంకుమ నా ముఖాన పెట్టి, ఏదో గొణిగి పూజచేశాడు.

"జోబులో చెయ్యిపెట్టు! పైసలు తియ్! అమ్మవారికి తాకించు! జయమవుతది! ధనం పెరుగుతది!"

నాలుగణాల కాయిన్ తీశాను.

"ఇదా ఇస్తుండవ్? రామబంటు దీనికా ఆశిస్తడు? అనుమానిస్తున్నవ? తియ్యి!"

అర్ధరూపాయి తీశాను.

మళ్ళీ అదే మాట అన్నాడు.

రూపాయినోటు తీశాను.

"అమ్మవారికి తృప్తి లేదు. జోబులో చెయ్యి పెట్టు!"

మళ్ళీ రూపాయి తీశాను.

"వాళ్ళు పదులు! వాళ్ళు పదులు! రామన్నకు, లచ్చుమన్నకు, సీతమ్మకు, హనుమన్నకు వాళ్ళు పదులు తియ్యి!"

"అబ్బా! అంత డబ్బే?" అన్నాను.

"మూడు పదులు!"

"నాదగ్గిర లేదు. అంత ఇవ్వలేను."

"నీది నీ కిస్తనులే! చెయ్యి పెట్టు! తియ్యి! అమ్మవారికి తాకించు."

జోబులో చెయ్యి పెట్టి ఆ ఉదయమే ఇంటి ఖర్చులకని అప్పు తెచ్చుకున్న పది రూపాయలు తీశాను, ఇక వేరే చిల్లరనోట్లు లేవుగనక.

"అమ్మవారి మీద ఉంచు. జయమవుతది. ధనం పెరుగుతది. హనుమరాజా పలుకు సత్తెం!"

పదిరూపాయల నోటు, చిల్లర రెండు రూపాయలు అమ్మవారిపై ఉంచాను.

"దోసిలి పట్టు!" కళ్ళు మూసుకొని తెరిచి ప్రసాదానికి దోసిలి పట్టినట్లు పట్టాను.

కుంకుమ పెట్టాడు. చిల్లర రూపాయలు రెండు నా దోసిట్లో పెట్టి, పదిరూపాయల నోటు తీసుకున్నాడు.

"ఇది తీసుకో! అది ఇచ్చెయ్యి!" అని చెయ్యి జాచాను.

"డబ్బు వస్తది! పోతది! హనుమరాజా పలుకు సత్తెం!" అని నా చేతిని ముందుకు తోశాడేకానీ పదిరూపాయలుమాత్రం ఇవ్వలేదు.

"ఆరునెల్లకు తిరిగొస్త! మిగిలిన మూడు పదులిస్తువులే! దొర! సత్తెం తెలుసుకొని ఇస్తువులే!" అంటూ పదిరూపాయల నోట జోలెలో పెట్టుకున్నాడు.

"లేయి, దొర! లేయి! జయమవుతది! కాఫీ తెచ్చిండా?"

ఇబ్రహీం మాకోసం కాచుకొనిఉన్నాడు. కాఫీ పోసి ఇచ్చాడు. కాఫీ తాగుతున్నానేకానీ మనసు పదిరూపాయల వెంట పోయింది. 'ఈ దినం ప్రొద్దున్నే ఎవరి ముఖం చూశావా భగవాన్!' అనుకున్నాను.

"దొరా! హనుమరాజా సత్తెం తెలుసుకోవాలంటే, మూలిక తీసి పాలల్లో వెయ్యి. గిరగిరా అయిదుసార్లు తిరుగుతది. యాదుంచుకో! రే పొస్తనులే మీ దొర కోసం!" అని వెనుదిరిగి అడుగులో అడుగు వేసుకుంటూ దేవతల పేర్లు వల్లిస్తూ వెళ్ళిపోతున్నాడు.

"కుర్ కొండ దే— —త! కొండ దే—వ-త! ' కొండ దే—వ—త! !" అంటూ వె_పోతూంటే, అతని వీపు మీద ఉన్న వెంట్రుకలు నన్ను చూసి నవ్వినట్టు అనిపించింది

"ఏం చెప్పాడు, సార్!" అని వాచ్‌మన్ ఆదుర్దాగా అడిగాడు.

"ఆఁ . . . ఏం చెప్తాడు? మామూలే! వాళ్ళ డబ్బులు సంపాయించుకోటానికి" అని పెదవి విరిచాను.

"కొన్నైనా నిజమేనా, సార్!" ఆశతో, ఆదుర్దాగా అడిగాడు,

బదులు చెప్పలేదు.

"ఎంత డ చ్చారు, సార్!"

"ఎంతో కొంత! నీ పని చూసుకో."

"లేదు, సార్! నేనుకూడా చేయి చూపించుకుందామని" అంటూ తల గోక్కుంటూ అన్నాడు.

అరువు తెచ్చుకున్న పదిరూపాయలు పోగొట్టుకున్న నా భవిష్యత్తు ఆలోచిస్తూ బదులు చెప్పలేదు.

ఏది నిజం? ఏ దబద్దం??

★

వాయిదాలమీద ట్రాన్సిస్టర్



రు. 320/-ల ఖరీదగు ప్రపంచ ప్రసిద్ధమైన "టెలి-క్వీన్" 3 బాండ్ల అఖిల ప్రపంచ పోర్టబుల్ ట్రాన్సిస్టర్‌ను రు. 10/- - అల్పమొత్తపు నెలసరి వాయిదాలమీద పొందండి. వెంటనే వ్రాయండి

ATLASCO (APVW)-22),
P.O. Box 1329, Delhi-6